## 69. ధ్యానం అంటే?

వందల కొద్దీ బౌద్ధ సన్న్యాసులు నివశించే ఓ బౌద్ధారామాన్ని ఓ చైనీస్ రాజు సందర్శించాడు. వారు నిద్రించే, వంటచేసే, భోజనాలు చేసే, సత్సంగం జరుపుకునే భవంతులన్నీ ఆ రాజుకి చూపించారు. ఐతే ఓ భవంతి గురించి ఏం చెప్పకపోవడంతో రాజు ఆసక్తిగా సన్న్యాసులు అందులో ఏం చేస్తారని అడిగాడు.

"అందులో ఏం చేయరు." జవాబు చెప్పాడు గురువు.

అందులోకి వెళ్ళిన రాజుకి కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్న బౌద్ధ సన్న్యాసులు కనబడటంతో అడిగాడు.

"మీరు అబద్ధం చెప్తారే? ఇక్కడంతా ధ్యానం చేస్తున్నారు కదా?"

"మీరు చూసింది తప్పు. సన్న్యాసులు శరీరంతో కాని, మనసుతో కాని ఏ పనీ చేయని చోటిది. వారంతా తమ స్వస్థితిలో వుంటారంతే." వివరించాడు గురువు.

## 70. ఈశ్వరుడు

ఆదిశంకరాచార్య పరంపరలోని ఓ గురువు తన శిష్యులకి అద్వైత పాఠాన్ని బోధిస్తున్నాడు. ఆ సందర్భంగా భగవద్గీతలోని ఓ శ్లోకాన్ని చదివాడాయన.

"ఈశ్వర సర్వ భూతానాం హృద్దేశేర్జున... అంటే ప్రపంచంలోని సర్వ జీవుల్లో ఒక్క ఈశ్వరుడే ఆత్మ రూపంలో ఉన్నాడు. మనం ఇతర జీవులకి ఏదైనా అపకారం చేస్తే సాక్షాత్తు ఆ పరమాత్మకి అపకారం చేసినట్లే." చెప్పాడు.

ఇంతలో రెండు ఏనుగులు ఘీంకారం చేస్తూ వీళ్ళ మీదకి వచ్చాయి. అందరికన్నా ముందు గురువే పరిగెత్తి పారిపోయాడు. ఏనుగులు వెళ్ళిపోయి అంతా తిరిగి కలుసుకున్నాక కొందరు శిష్యులు గురువుని అడిగారు.

"గురువు గారు! ఇందాక సర్వ జీవుల్లో వున్నది ఈశ్వరుడే అని మీరు చెప్పారు. మరి ఏనుగుల్లో కూడా ఈశ్వరుడు ఉన్నాడు కదా? ఆ ఈశ్వరుడికి ఎందుకు మీరు భయపడి పారిపోయారు?"

"పారిపోయింది కూడా ఈశ్వరుడే." బదులు చెప్పాడు గురువు.

## 71. ఈశ్వరుడి ఇచ్ఛ

ఓ సద్గురువు తన శిష్యులకి ధ్యాన యోగాన్ని నేర్పించి వాళ్ళని ఆధ్యాత్మికంగా అభివృద్ధి దిశలో నడిపిస్తున్నాడు. ఓ రోజు ఆ గురువు గారి కాళ్ళు స్వాధీనం తప్పాయి. నడవలేక మంచాన పడ్డాడాయన. శిష్యులంతా ఆ రోగానికి వైద్యం చేయించుకోమని ఆయన్ని ప్రార్థించారు.

"పూర్వ జన్మలో నేను చేసిన పాపానికి ఇది శిక్ష. దీన్ని అనుభవిస్తే కాని ఆ పాపం పోదు." నిరాకరించాడు గురువు.

"భగవంతుడ్ని ప్రార్థిస్తే మీ రోగాన్ని ఆయన తొలగించేస్తాడు కదా? పోనీ ఆ పని చేయండి." కోరారు శిష్యులు.

"పిచ్చివాళ్ళల్లారా! భగవంతుడి ఇచ్ఛ లేకుండా ఈ జబ్బు నాకు వచ్చిందనుకుంటున్నారా? ఇంక దీన్ని తొలగించమని ఆయన్ని నేనెలా ప్రార్థించేది?" నిరాకరిస్తూ చెప్పాడు గురువు.

## 72. శాంతి మార్గం

రకరకాల సమస్యలతో అల్లల్లాడుతున్న ఒక వ్యక్తికి, తమ గ్రామానికి ఓ బౌద్ధ భిక్షువు వచ్చాడని తెలిసింది. అతని దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"స్వామీ! నాకు శాంతి కావాలి. దాన్ని పొందే మార్గం చెప్పండి."

ఆ బౌద్ధ భిక్షువు నవ్వి జవాబు చెప్పాడు.

"'ఏముంది? 'నాకు కావాలి' తీసేస్తే ఇక మిగిలేదంతా శాంతే కదా నాయినా."